క్రిస్టియన్స్‌పై జరుగుతున్న దాడులపై ఫిర్యాదు

నల్లకుంట: నేషనల్‌ క్రిస్టియన్‌ బోర్డ్‌(ఎన్‌సీబీ) చైర్మన్‌ జాన్‌ మస్కి నగర పర్యటనకు విచ్చేశారు. ఈ సందర్భంగా బుధవారం బీజేపీ మైనార్టీ మోర్చా మీడియా ఇన్‌చార్జి, ఇండో ఇజ్రాయెల్‌ ఫ్రెండ్‌షిప్‌ అసోసియేషన్‌ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం. ఐజాక్‌ రాజ్‌ ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్రైస్తవుల సమస్యలను ఆయనకు వివరించారు. అలాగే తెలుగు రాష్ట్రాల్లో చర్చీలు, పాస్టర్లపై జరుగుతున్న దాడులపై ఆయనతో చర్చించారు.

కాంగ్రెస్‌ ప్రభుత్వం పేదల పక్షపాతి



సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు అందజేస్తున్న షబ్బీర్‌ అలీ

ముషీరాబాద్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వం పేదల పక్షపాతి అని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌ అలీ అన్నారు. బుధవారం భోలక్‌పూర్‌కు చెందిన మహ్మద్‌ షకీల్‌, అబ్దుల్‌ లతీఫ్‌, గులామ్‌ మోహినోద్దీన్‌, అబేద్‌ హుస్సేన్‌, మహ్మద్‌ అలీలకు సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా షబ్బీర్‌ అలీ మాట్లాడుతూ... పేదలకు ప్రైవేటు ఆస్పత్రులలో మెరుగైన వైద్యం పొందేందుకు సీఎం రిలీఫ్‌ ఫండ్‌ ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. పేదలకు సీఎం రేవంత్‌రెడ్డి అండగా ఉంటూ వారి అవసరాలను తీర్చుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో భోలక్‌పూర్‌ మాజీ కార్పొరేటర్‌ వాజీద్‌ హుస్సేన్‌ తదితరులు పాల్గొన్నారు.

జూలై 13న లష్కర్‌ బోనాలు

సనత్‌నగర్‌: వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని ని సికింద్రాబాద్‌ ఉజ్జయినీ మహంకాళి ఆలయ ఈఓ గుత్తా మనోహర్‌రెడ్డి, పండితులతో కలిసి లష్కర్‌ బోనాల తేదీలను వివరించారు. జూన్‌ 29న అమ్మవారి ఘటాల ఊరేగింపు, జూలై 13న లష్కర్‌ బోనాలు, 14న రంగం (భవిష్యవాణి) ఉంటుందన్నారు.

16 నుంచి 'కిడ్స్‌ సమ్మర్‌ క్యాంప్‌'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్‌ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో కిడ్స్‌ సమ్మర్‌ క్యాంప్‌ను ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో స్వీయ చర్చా కార్యక్రమం, సృజనాత్మక ధ్యానం, విలువలతో కూడిన కార్యకలాపాలు, జ్ఞాపక శక్తిని పెంచుకోవడం, మైండ్‌ల్యాబ్‌, డిజిటల్‌ వెల్‌నెస్‌ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో 9–14 ఏళ్ల లోపు వారికి అవకాశం కల్పిస్తారు. కార్యక్రమంలో పాల్గొనే వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు ఫోన్‌ నంబర్‌ 040–23001234, సెల్‌ నంబర్‌ 8143466670 సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

28న 'జనభేరి' బహిరంగ సభ

హిమాయత్‌నగర్‌ : వనపర్తి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ఈనెల 28న వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాలలో 'జనభేరి' పేరుతో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు బీసీ పొలిటికల్‌ జేఏసీ స్టేట్‌ చైర్మన్‌ రాచాల యుగంధర్‌ గౌడ్‌ వెల్లడించారు. బుధవారం బషీర్‌బాగ్‌ దేశోద్ధారక భవన్‌లో మాట్లాడుతూ.. సభలో వనపర్తి జిల్లాలోని అన్ని మండలాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలు ప్రస్తావిస్తామన్నారు.

పెంచిన ఫీజులను ప్రభుత్వమే భరించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: పెంచిన ఇంజినీరింగ్‌ కోర్సుల ఫీజుల భారాన్ని ప్రభుత్వం భరించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్‌ బుధవారం డిమాండ్‌ చేశారు. విద్యార్థులపై పెంచిన ఫీజుల భారాన్ని వేయడంతో అనేక మంది పేద విద్యార్థులు ఇంజినీరింగ్‌ విద్యకు దూరమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక పథకాలు, ఉచితాలతో లక్షల కోట్ల సంపదను ప్రజలకు అందజేస్తున్న ప్రభుత్వం విద్యార్థుల ఫీజులు భరించలేరా అని ప్రశ్నించారు. బీసీలకు 20 ర్యాంక్‌లోపు నిబంధనను ఎత్తివేయాలన్నారు.

సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

మూసాపేట: సరస్వతి పుష్కరాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నామని కూకట్‌పల్లి డిపో మేనేజర్‌ హరి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జయశంకర్‌ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరంలో ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు సరస్వతి పుష్కరాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పుణ్య స్నానాలు ఆచరించే భక్తుల కోసం ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నామని అన్నారు. కాలనీలో 40 మంది ప్రయాణికులు ఉంటే కాలనీకే బస్సును పంపిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 8919493417 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌
- నల్లకుంట, కాచిగూడ డివిజన్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ఎమ్మెల్యే కాలేరుకు తమ సమస్యలను వివరిస్తున్న నల్లకుంట స్ట్రీట్‌ నం.8 వాసులు



నల్లకుంటలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌, కార్పొరేటర్‌ అమృత

నల్లకుంట: నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చక్కటి ప్రణాళికతో పలు అభివృద్ధి చేపడుతున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ చెప్పారు. కోట్లాది రూపాయలతో ఇప్పటికే నియోజకవర్గంలోని అన్ని పార్కుల సుందరీకరణ పనులు చేపట్టి మౌళిక సదుపాయాలు కల్పించామన్నారు. అలాగే రోడ్ల నిర్మాణం, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, సెంట్రల్‌ లైటింగ్‌, అంబర్‌పేట సీపీఎల్‌ రోడ్డు – నల్లకుంట ఫీవర్‌ ఆస్పత్రి చౌరస్తా నుంచి బర్కత్‌పుర సిగ్నల్స్‌ వరకు సెంట్రల్‌ మెరీడియన్‌ డివైడర్‌ల నిర్మాణ పనులు చేపట్టామని చెప్పారు. బుధవారం నల్లకుంట బజాజ్‌ ఎలక్ట్రానిక్స్‌ పక్క లేన్‌లో సుమారు రూ.26లక్షల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టనున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్‌ అమృతతో కలిసి శంకుస్థాపన చేశారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... డివిజన్‌లో చాలా ప్రాంతాలలో దశాబ్దాల క్రితం నిర్మించిన డ్రైనేజీ, సీవరేజీ పైపులు శిథిలావస్థకు చేరి లీకేజీలు ఏర్పడి మురుగు సమస్యలు తలెత్తేవన్నారు. ఈ సమస్యలను స్థానికులు తన దృష్టికి తీసుకురావడంతో జలమండలి అధికారులతో మాట్లాడి ప్రతిపాదనలు తయారు చేయించానన్నారు. అందుకే ఆయా ప్రాంతాలలో కొత్త పైపులు వేయించామని తెలిపారు. ఈ పనులు పూర్తయిన వెంటనే ప్రత్యేక నిధులతో ఛిద్రమైన రోడ్ల స్థానంలో కొత్తగా సీసీరోడ్ల నిర్మాణ పనులు చేపడతామని చెప్పారు.

ఈ సందర్భంగా స్థానికులు కొన్ని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను సావధానంగా విన్న ఎమ్మెల్యే వాటి పరిష్కారానికి సత్వర చర్యలు చేపడతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఈఈ ప్రవీణ్‌, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ నరేందర్‌, బీజేపీ నాయకులు ఎంటీ. కిషోర్‌ కుమార్‌, ప్రశాంత్‌ జోషి, ఎం.మురళీ యాదవ్‌ బీఆర్‌ఎస్‌ నాయకులు గాలపల్లి శంకర్‌, సాయిని మూర్తి, మిర్యాల రవీందర్‌, సీహెచ్‌. సాయి మోహన్‌, క్రిసోలైట్‌, వన్నాడి రమ్య, ఇర్పాన సుల్తాన, నవీన్‌, బొమ్మిడి శ్రవణ్‌, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పనులను పూర్తి చేయాలి

కాచిగూడ: అంబర్‌పేట నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ అధికారులకు సూచించారు. బుధవారం కాచిగూడ డివిజన్‌ చెప్పల్‌బజార్‌లో రూ.20 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్‌ కన్నె ఉమా రమేష్‌యాదవ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన బస్తీల్లో పర్యటించి స్థానికులు ఎదుర్కొంటున్నసమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవిలో తాగు నీటికి ఇబ్బంది రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని జలమండలి అధికులను కోరారు. తాగునీటి సమస్య ప్రాంతాలను గుర్తించి సరఫరాను మెరుగుపర్చాలని ఆయన చెప్పారు. ప్రజలు ఎవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీఈ ప్రవీణ్‌, ఏఈ ప్రశాంత్‌, జలమండలి ఏఈ భావన, బీఆర్‌ఎస్‌ డివిజన్‌ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్‌, ఇన్‌చార్జి డాక్టర్‌ బద్దుల శిరీష ఓంప్రకాష్‌ యాదవ్‌, దాత్రిక్‌ నాగేందర్‌ బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.



చెప్పల్‌బజార్‌లో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌, కార్పొరేటర్‌ ఉమారాణి

అండర్‌ 14 క్రికెట్‌ టోర్నమెంట్‌ పోస్టర్‌ ఆవిష్కరణ



గాంధీనగర్‌లో క్రికెట్‌ టోర్నమెంట్‌ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ నేత వినయ్‌కుమార్‌, తదితరులు

చిక్కడపల్లి: గాంధీనగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ పావని ఆధ్వర్యంలో సీవీ చారిటబుల్‌ ట్రస్ట్‌ సౌజన్యంతో గాంధీనగర్‌ డివిజన్‌లో ఈనెల 16, 17వ తేదీలలో అండర్‌ 14 క్రికెట్‌ టోర్నమెంట్‌ నిర్వహించనున్నారు. దీనికి సబంధించిన పోస్టర్‌ను బుధవారం గాంధీనగర్‌ కార్పొరేటర్‌ కార్యాలయంలో బీజేపీ సికింద్రాబాద్‌ పార్లమెంట్‌ జాయింట్‌ కన్వీనర్‌ ఎ.వినయ్‌కుమార్‌ ఆవిష్కరించి మాట్లాడారు. శుక్రవారం, శనివారం రెండు రోజులు స్థానిక శ్రీనివాసా గ్రౌండ్స్‌లో క్రికెట్‌ టోర్నమెంట్‌ జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు తమ ఆధార్‌కార్డు జిరాక్స్‌తో నిర్వాహకులను సంప్రదించాలని కోరారు. వివరాలకు ఫోన్‌ నం. 917730 2777, 7799 65788లలో సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌ బీజేపీ అధ్యక్షుడు వి.నవీన్‌కుమార్‌, నాయకులు రత్నసాయిచంద్‌, శ్రీకాంత్‌, దామోదర్‌, పి.నర్సింగ్‌రావు, సత్తిరెడ్డి, శివకుమార్‌, సాయికుమార్‌, ఆనంద్‌రావు, సత్యేందర్‌, రాహుల్‌, సాయి తేజ, నీరజ్‌, కృష్ణవేణి పాల్గొన్నారు.

సత్యసాయి సేవా సమితి సేవలు అభినందనీయం



మజ్జిగ పంపిణీ ప్రారంభిస్తున్న సమితి అధ్యక్షుడు ఎన్‌ఎస్‌ కృష్ణమూర్తి, సభ్యులు

ముషీరాబాద్‌: సామాజిక సేవ కార్యక్రమాల నిర్వహణలో సత్యసాయి సేవా సమితి సభ్యులందరూ చేస్తున్న కృషి అభినందనీయమని... వారి సేవలు ఇతరులకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని సత్యసాయి సేవా సమితి విద్యానగర్‌ శాఖ అధ్యక్షుడు ఎస్‌.ఎస్‌.కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం రాంనగర్‌ గుండు చౌరస్తాలో సత్యసాయి సేవా సమితి సభ్యులు లలితనగర్‌ అడిక్‌మెట్‌ కాలనీల రెసిడెన్షియల్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు సి.బ్రహ్మం, శ్రీలత దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన మజ్జిగ పంపిణీని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. విద్యానగర్‌ శాఖ ఆధ్వర్యంలో తన సంస్థ సభ్యుల సహకారంతో ఏప్రిల్‌ 17వ తేదీ నుంచి చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నామని జూన్‌ 15వ తేదీ వరకు కొనసాగుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు సత్యనారాయణ, ఎస్కే ప్రసాద్‌, డి.లక్ష్మీనారాయణ, జీవీఎస్‌ రెడ్డి, కృష్ణారెడ్డి, సుగుణ, సంధ్య, రవీంద్రనాథ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

దేశ అభివృద్ధికి మార్గదర్శకులు నేటి యువత



ఫ్లాగ్‌మార్చ్‌ జాతాను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈటీ నర్సింహ

హిమాయత్‌నగర్‌ : దేశ అభివృద్ధికి మార్గదర్శకులు నేటి యువత అని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, ఏఐవైఎఫ్‌ రాష్ట్ర నిర్మాణ బాధ్యులు ఈటీ.నర్సింహ పేర్కొన్నారు. ఏఐవైఎఫ్‌ 17వ జాతీయ మహాసభలు మే 15 నుంచి 18 వరకు తిరుపతిలో జరుగుతాయని పేర్కొన్నారు. గత 16వ జాతీయ మహాసభలు హైదరాబాద్‌లో జరిగాయన్నారు. ఏఐవైఎఫ్‌ ఆనవాయితీ ప్రకారం యువజన సంఘ జెండాను ప్రస్తుతం తిరుపతిలో జరుగుతున్న సభా ప్రాంగణానికి ఫ్లాగ్‌మార్చ్‌ పేరిట జాతాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఫ్లాగ్‌మార్చ్‌ను హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌ నుంచి ఈటీ.నర్సింహ ముఖ్యఅతిథిగా హాజరై ఏఐవైఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు వలిఉల్లా ఖాద్రీ, కార్యదర్శి కల్లూరు ధర్మేంద్రలతో కలసి జెండా ఊపి ప్రారంభించారు. ఏఐవైఎఫ్‌ నాయకులు నెర్లకంటి శ్రీకాంత్‌, సత్య ప్రసాద్‌, సల్మాన్‌ బేగ్‌, షేక్‌ మహమూద్‌, మాజీద్‌ అలీఖాన్‌, కళ్యాణ్‌, హేమంత్‌, వంశీ, మోసిన్‌ ఖాన్‌, మహేష్‌, భరత్‌, మురళి, నవీన్‌, కీర్తన్‌ తదితరులు పాల్గొన్నారు.

హంస వాహన సేవ..



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చిక్కడపల్లిలోని వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం హంస వాహన సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చిక్కడపల్లి శ్రీనివాసపురం తిరువీధుల గుండా స్వామివారి హంస వాహన సేవ కొనసాగింది. అంతకుముందు ఉదయం 6గంటలకు సుప్రభాతసేవ, బింద తీర్థం, హవనం, మహా నివేదన, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ వంశపారంపర్య ధర్మకర్త శ్రీనాథ్‌గౌడ్‌, కీర్తి దంపతులు, జి.సువర్ణ, ఆలయ ఈఓ ఎస్‌.అన్నపూర్ణలు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కాచిగూడ: హిందూ శ్మశానవాటిక కాచిగూడ ఆధ్వర్యంలో హర్రాస్‌పెంటలోని శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో అందిస్తున్న ఉచిత వైద్య, ఫిజియోథెరపీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్మశాన వాటిక ట్రస్ట్‌బోర్డు అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌ గౌడ్‌ కోరారు. బుధవారం ఉచిత వైద్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వైద్య సేవలతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేస్తున్నట్లు తెలిపారు. పేద మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ, మెహిందీ డిజైనింగ్‌, యోగా, తదితర విభాగాల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్‌ విగ్‌, సాయి గిరిధర్‌, భీమగాని కృష్ణగౌడ్‌, రతన్‌ విద్యాసాగర్‌, నందకిషోర్‌ యాదవ్‌, విజయ్‌కుమార్‌, తదితరులు పాల్గొన్నారు.

న్యూ అచ్చయ్యనగర్‌ బస్తీ నూతన కమిటీ

ముషీరాబాద్‌: రాంనగర్‌ డివిజన్‌లోని న్యూ అచ్చయ్యనగర్‌ బస్తీ నూతన కమిటీని అధ్యక్షుడు ఏజే బాబుగౌడ్‌ బుధవారం ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా పలారం నర్సింహ, చైర్మన్‌గా వైనేరూ చారి, ఉపాధ్యక్షులుగా ఆర్‌.గోపాల్‌, ఆర్‌.రవిగౌడ్‌, సంయుక్త కార్యదర్శులుగా ఆడు బాలకృష్ణ, ఎండీ గౌస్‌, జి.సురేష్‌, కోశాధికారులుగా జి.వెంకటేశ్వరరావు, పుట్టా శ్రీనివాస్‌, కార్యానిర్వహక కార్యదర్శిగా టి.శక్తిసింగ్‌, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్‌, ఏ.రాజు, కె.భాస్కర్‌, కె.సతీష్‌, పుట్ట సవంత్‌, డి.రాజయ్య, హెచ్‌.మహేష్‌, రాజు, హెచ్‌.నరేష్‌, కె.కిరణ్‌, బి.సైదులు నియమితులైయ్యారు. బస్తీ అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు.

కాంగ్రెస్‌ నేత శ్రీశైలంయాదవ్‌కు పితృవియోగం



సత్యనారాయణ (ఫైల్‌)

ముషీరాబాద్‌: భోలక్‌పూర్‌ గాంధీనగర్‌కు చెందిన కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు శ్రీశైలంయాదవ్‌ తండ్రి సత్యనారాయణ(74) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం యశోద ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరిశీలించి ఆయన చనిపోయారని ప్రకటించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్‌, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్‌, బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకులు ఎమ్మెన్‌ శ్రీనివాస్‌రావు, ముఠా జైసింహ, యూత్‌ కాంగ్రెస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్‌ యాదవ్‌, కార్పొరేటర్‌ పావనివినయ్‌కుమార్‌, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూసరాజు, తెలంగాణ ఉద్యమ నాయకుడు ప్రఫూల్‌రాంరెడ్డి తదితరులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం

చిక్కడపల్లి: గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైన సంఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్‌ రాజునాయక్‌, ఎస్సై అభిలాష్‌ బుధవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వీఎస్టీ పార్కు వద్ద స్పృహ లేకుండా పడుకుని ఉన్న 65 ఏళ్ల పైబడిన వృద్ధుడిని పోలీసులు గుర్తించారు. వెంటనే 108 అంబులెన్స్‌ను పిలిపించి చూడగా అప్పటికి వృద్ధుడు మృతిచెందినట్లు సిబ్బంది తెలిపారు. ఆ భౌతికకాయన్ని గాంధీ మార్చురీకి తరలించారు. వీఎస్టీ పార్కు, సినిమా థియేటర్లు, హోటళ్ల వద్ద భిక్షాటన చేస్తాడని పోలీసులు చెబుతున్నారు. మృతుడుని గుర్తిస్తే ఫోన్‌ నం .87126 60163లో లేదా పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

సమ్మెలో బహుజన కార్మికవర్గం పాల్గొనాలి



ఓంకార్‌ భవన్‌లో జరిగిన కార్మిక సంఘాల జేఏసీ సదస్సులో మాట్లాడుతున్న దండి వెంకట్‌

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశవ్యాప్తంగా ఈనెల 20న జరిగే సమ్మెలో బహుజన కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్‌ పిలుపునిచ్చారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్‌ భవన్‌లో బహుజన వామపక్ష కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా దండి వెంకట్‌ మాట్లాడుతూ... రాజ్యాంగం కల్పించిన 44 రక్షణ చట్టాలను కేంద్రం రద్దు చేసి కార్మిక వ్యతిరేక కోడ్‌లను కార్పొరేట్‌ సంస్థల లాభాల కోసమే తీసుకొస్తోందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న ఔట్‌ సోర్సింగ్‌ కార్మికులను పర్మనెంట్‌ చేయాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి కనీస వేతనం రూ.26వేలను అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ట్రేడ్‌ యూనియన్‌ నాయకులు అనిల్‌కుమార్‌, కె. చంద్రశేఖర్‌, సిద్ధిరాములు, ప్రసాద్‌, రాజేష్‌, మల్లేష్‌, యాకయ్య, కలీల్‌, యాదగిరి, జంగయ్య, ప్రభాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



కాచిగూడ: గ్రేటర్‌ హైదరాబాద్‌ పరిధిలో ఇల్లులేని పేదలకు 100 గజాల ఇంటి స్థలంతో పాటు ఇంటి పట్టాలను అందజేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్‌.కృష్ణయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆర్‌.కృష్ణయ్య నేతృత్వంలో బీసీ సంఘాల ప్రతినిధి బృందం రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కోర్టు కేసు పరిష్కారమైనందున ఇంటి పట్టాలు ఇచ్చి పెండింగ్‌లో పెట్టిన 4వేల మందికి ఇంటిస్థలం పొజిషన్‌ ఇవ్వాలని ఆయన మంత్రికి విజ్ఞప్తి చేశారు. బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నీలం వెంకటేష్‌, సి.రాజేందర్‌ పాల్గొన్నారు.

బహుభాష విజ్ఞాని 'మల్లాది రామకృష్ణశాస్త్రి'



ఎందరో మహానుభావులు కార్యక్రమంలో మాట్లాడుతున్న హాస్యావధాని శంకరనారాయణ

చిక్కడపల్లి: మల్లాది రామకృష్ణశాస్త్రి రచనలు 'సంప్రదాయం, ఆధునికత'ల కలబోతతో పాఠకులలో ఆసక్తి కలిగించే విధంగా ఉంటాయని హాస్యావధాని, ప్రముఖ జర్నలిస్ట్‌ శంకర నారాయణ అన్నారు. త్యాగరాయ గానసభలో 'ఎందరో మహానుభావులు'కార్యక్రమంలో భాగంగా బుధవారం విఖ్యాత కవి పండితులు 'మల్లాది రామకృష్ణశాస్త్రి యాదిలో..'సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన శంకరనారాయణ మాట్లాడుతూ... మల్లాది రామకృష్ణశాస్త్రి సాహితీ విశ్వవిద్యాలయం లాంటి వారని అభివర్ణించారు. రామకృష్ణశాస్త్రి దేశ భాషల్లోనే కాకుండా జర్మనీ, ఫ్రెంచ్‌, రష్యన్‌ వంటి విదేశీ భాషల్లోనూ పట్టు ఉన్న బహుభాష విజ్ఞాని అని కొనియాడారు. ఆయన రచించిన కథలు తెలుగు భాషకు ప్రామాణికంగా నిలుస్తాయని పేర్కొన్నారు. జీవితమంతా జ్ఞాన సంపద కోసం కృషి చేసిన ఆయన అత్యంత నిరాడంబర జీవితాన్ని గడిపారని గుర్తు చేశారు.

సాహితీ కిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు మాట్లాడుతూ... రామకృష్ణశాస్త్రి సినీపాటలను రాసినా తక్కువే అయినా అవి ఎంతో ప్రాచుర్యం పొందాయని అన్నారు. రహస్యం సినిమాలో గిరిజా కల్యాణం, కన్యాశుల్కంలో 'చిటారు కొమ్మన మిఠాయి పొట్లం చేతి కందది'అని వ్యంగ్యంతో ఉండే పాట, 'తిరుమలగిరి వాసా నిత్య మందహాసా'భక్తిపాటలలో తెలుగు నుడికారం ఉట్టిపడుతుందని అన్నారు.

గానసభ అధ్యక్షుడు కళా జనార్దనామూర్తి మాట్లాడుతూ.. తెలుగు భాష ఉన్నతికి కారకులైన మల్లాది వంటి వారిని గుర్తుచేసుకోవటం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గాయకులు శ్రీమణి, ధారా సుబ్రహ్మణ్యం, వందే భారత్‌, సినీ నిర్మాత, దర్శకుడు మల్లం రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

కేండిల్‌ ర్యాలీ..



సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ఆర్మీ జవానులకు నివాళులర్పిస్తున్న సామాజిక తెలంగాణ పార్టీ నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆపరేషన్‌ సిందూర్‌లో మృతి చెందిన ఆర్మీ జవాన్‌లకు, భారత పౌరుల ఆత్మకు శాంతి చేకూరాలని సామాజిక తెలంగాణ పార్టీ ఆధ్వర్యంలో కేండిల్‌ ర్యాలీ నిర్వహించారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద జరిగిన ర్యాలీలో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు అమానగంటి సైదులు, సీహెచ్‌ రాజకుమార్‌గౌడ్‌, ఎం.సతీష్‌ యాదవ్‌, ప్రఫుల్‌ రామ్‌రెడ్డి, మాచర్ల వెంకటస్వామి, లావణ్య, చంద్రన్న, మెట్టు ధన్‌రాజ్‌, యాదగిరి, రవికుమార్‌ తదితరులు పాల్గొన్నారు.